బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా విజేందర్‌రెడ్డి



విజేందర్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

జీడిమెట్ల: బీజేపీ 130వ డివిజన్ అధ్యక్షుడిగా శాంపూర్ విజేందర్‌రెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించినందుకు ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఎంపీని ఆయన నివాసంలో కలిశారు. పార్టీలో కష్టపడే వారికి భవిష్యత్ ఉంటుందని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో గిరివర్ధన్‌రెడ్డి, బక్కా శంకర్‌రెడ్డి, నందనం దివాకర్ చిన్నస్వామి, కంది శ్రీరాములు, విజయ్, శ్రీనివాస్‌గుప్తా, శారద పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌పై ఫిర్యాదు



ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

జీడిమెట్ల: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌పై కేసు నమోదు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రామ మందిర ప్రతిష్ఠాపనతో దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని వ్యాఖ్యానించడం స్వాతంత్ర్య పోరాట అమరవీరులను అవమానించడమేనని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన చిత్తారమ్మ జాతర

సుభాష్‌నగర్: గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతర శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమంతో ముగిసింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 17న ప్రారంభమై తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర జరిగింది. కార్యక్రమంలో కూన శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు అంతయ్య గౌడ్, ఆర్ బాలరాజ్, శంకర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నరసింహ, సంజీవరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత



స్పోర్ట్స్ డ్రెస్ అందజేస్తున్న సతీష్‌సాగర్

కుత్బుల్లాపూర్: సంకల్ప్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్ సాగర్ సౌజన్యంతో శనివారం కొంపల్లి పరిధిలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ సాగర్ మాట్లాడుతూ.. తమ సంస్థ గతంలో విద్యార్థులకు షూస్, స్కూల్ బ్యాగ్స్, బుక్స్ అందజేసిందన్నారు. వారికి ఇచ్చిన హామీ ప్రకారం 4వ తరగతి చదువుతున్న సుమారు 140 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు మధు, మహేందర్, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మల్లు రవిని కలిసిన నేతలు



లోక్‌సభ సభ్యులు మల్లు రవితో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, యూనియన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: నాగర్ కర్నూల్ లోక్ సభ సభ్యులు, హెచ్‌ఎంటీ కంపెనీ మెషిన్ టూల్స్ ఎంప్లాయీస్ యూనియన్ చీఫ్ ప్యాటన్ మల్లు రవిని శనివారం ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు కలిశారు. హెచ్‌ఎంటీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కేశవ్, శ్రీహరి, లక్ష్మణ్ జి, కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: రిపబ్లిక్ డే సందర్భంగా రామ్‌దేవ్ రావ్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వారం కేన్సర్, మమ్మోగ్రఫీ, ఎక్స్ రే, ఎంఆర్‌ఐ, సీబీపీ, లిక్విడ్ బేస్ సైటాలజీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

28 వార్డులు.. రూ.111 కోట్ల పనులు

నేటితో ముగియనున్న దుండిగల్ మున్సిపల్ పాలకవర్గం

భౌరంపేట, మల్లంపేట, దుండిగల్, గాగిల్లాపూర్, డి.పోచంపల్లి, బహదూర్‌పల్లి గ్రామాలు కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు



దుండిగల్ మున్సిపల్ కార్యాలయం



శంభీపూర్‌లోని వైకుంఠధామం

దుండిగల్ మున్సిపాలిటీ పాలకవర్గ పదవీ కాలం ఆదివారంతో ముగియనుంది. 2018 సంవత్సరంలో గ్రామ పంచాయతీలు విలీనంగా కాగా భౌరంపేట, మల్లంపేట, దుండిగల్, గాగిల్లాపూర్, డి.పోచంపల్లి, బహదూర్‌పల్లి గ్రామాలను కలుపుతూ 2018 ఆగస్టులో దుండిగల్ మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. రెండేళ్ల పాటు ప్రత్యేక అధికారుల పాలన అనంతరం 2020 జనవరిలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి. – దుండిగల్

అందరి సహకారంతో అభివృద్ధి



గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు లేవు. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి రూ.111 కోట్లకు పైగా నిధులు కేటాయించి రోడ్లు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేశాం. మౌలిక సదుపాయాలు కల్పించాం. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, సహచర కౌన్సిలర్లు, అధికారులు ప్రతి ఒక్కరూ అభివృద్ధికి సహకరించారు.

– కృష్ణవేణి, దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్

రూ.111 కోట్ల కేటాయింపు

ఐదేళ్ల పాటు మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లో రూ.111.2 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. నూతన రోడ్ల కోసం రూ. 61.67 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ. 34.17 కోట్లు, ఇతర పనులకు రూ. 15.28 కోట్లు ఖర్చు చేశారు. వీటి మొత్తంతో ఇప్పటికే 839 పనులు పూర్తి కాగా.. మరో 29 పనులు కొనసాగుతున్నాయి.



22వ వార్డులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

పారిశుద్ధ్యానికి..

రూ. 2.17 కోట్లు వెచ్చించి 14 చెత్త సేకరణ ట్రాక్టర్లు, ఆటోలు, జేసీబీ, స్వీపింగ్ వాహనం, డ్రైనేజీ క్లీనింగ్ వాహనం, వైకుంఠ రథాన్ని కొనుగోలు చేశారు. వాటితో పారిశుద్ధ్య నిర్వహణ పనులను కొనసాగిస్తున్నారు. అదే విధంగా వైకుంఠధామాల అభివృద్ధికి రూ.3.90 కోట్లను కేటాయించారు.

ఇప్పటి వరకు ఐదుగురు కమిషనర్లు

ఐదేళ్లలో ఇక్కడి మున్సిపాలిటీలో ఐదుగురు మున్సిపల్ కమిషనర్లు మారారు. గ్రామాల విలీనమైన మున్సిపాలిటీగా ఏర్పడిన సమయంలో మొట్టమొదటి కమిషనర్‌గా అప్పట్లో మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ జ్యోతిరెడ్డికి ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. తరువాత సురేష్, జ్యోతి, భోగేశ్వర్లు కమిషనర్లుగా పని చేయగా.. ప్రస్తుతం సత్యనారాయణ రావు కొనసాగుతున్నారు.

మొదటి నుంచి ఇన్‌చార్జి టీపీఓనే..

మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారిని నియమించకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఆరుగురు ఇన్‌చార్జీలుగానే పని చేశారు. ప్రస్తుత టీపీఓ సంజన సైతం దుండిగల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఇన్‌చార్జిగానే విధులు నిర్వహిస్తున్నారు.

కాలనీల అభివృద్ధే ప్రధాన ఎజెండా



నిజాంపేట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానందగౌడ్ తదితరులు

నిజాంపేట్: కాలనీల అభివృద్ధే ప్రధాన ఎజెండా అని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. శనివారం నిజాంపేట్‌లోని 11, 13 డివిజన్‌లతో పాటు 30వ డివిజన్‌లోని శివాజీ నగర్‌లో అభివృద్ధి పనులను మేయర్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా కేటీఆర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం, కేటీఆర్ కాలనీ రోడ్డు నంబర్ 6, 7లో సీసీ రోడ్డు శంకుస్థాపన, రామభద్ర అపార్ట్‌మెంట్స్ నుంచి జయదీపిక వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బెవర్లీ పాల్మ్స్‌లో బీటీ రోడ్డు ప్రారంభం, కోలన్ రాజిరెడ్డి హైట్స్ నుంచి వాటర్ ట్యాంక్ 600 ఎంఎం డయా అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి శంకుస్థాపన, జర్నలిస్టు కాలనీ నుంచి చెర్ల ఎల్లమ్మ గుడి వరకు సీసీ రోడ్డు ప్రారంభం, శివాజీ నగర్ కాలనీలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రారంభం తదితర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా..

కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనలో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేకానందగౌడ్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపల్ పరిధిల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో వందలాది కోట్ల నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రాష్ట్రంలో కుత్బుల్లాపూర్‌ను ప్రత్యేక స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

- కొంపల్లి మున్సిపల్ పరిధిలో రూ.2.79 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, మాజీ ఎంపీపీ సన్న కవిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.
- దుండిగల్ మున్సిపల్ పరిధిలో రూ.5.05 కోట్ల నిధులతో చేపట్టబోయే సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్‌లు, బీటీ రోడ్డు పనులకు చైర్‌పర్సన్ కృష్ణవేణితో కలిసి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బెంబడి వనీత, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణలపై ఆసక్తి చూపాలి



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

దుండిగల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై ఆసక్తి చూపాలని కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి అన్నారు. దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో శనివారం ఇన్నోవేషన్ ఛాలెంజ్ అండ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో 2025ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 40కు పైగా వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించగా 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రావు, డీన్ డాక్టర్ రాధికా దేవి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. అచ్చిరెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ వై. బలరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణవేణి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ 27వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించనున్న బంజారా భవనం, రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, గణేశ్‌నగర్‌లో రూ.23 లక్షలతో డ్రైనేజీ, తండాలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, రూ.35 లక్షలతో డ్రైనేజీ తదితర పనులకు కౌన్సిలర్ కొర్ర శంకర్‌నాయక్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లలో మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, నాయకులు కుంటి నాగరాజు, సుధాకర్ రెడ్డి, లక్ష్మీబాయి, అమర్ సింగ్, రవీందర్ నాయక్, జగన్ నాయక్, భీమ్ సింగ్, వెంకటేష్ నాయక్, మోర అశోక్, ప్రేమ్ సింగ్, గడిల ప్రవీణ్, నరేందర్ నాయక్, ప్రవీణ్ నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 19వ డివిజన్ అధ్యక్షుడిగా శంకర్



కొలను హన్మంతరెడ్డిని కలిసిన శంకర్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ 19వ డివిజన్ అధ్యక్షుడిగా ఆగం శంకర్ ముదిరాజ్ నియమితులయ్యారు. శనివారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్‌రెడ్డి శంకర్‌ను డివిజన్ అధ్యక్షుడిగా నియమించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కొలను కృష్ణారెడ్డి, సత్తిరెడ్డి, జీతయ్య, జీవన్‌రెడ్డి, బాలు, నారాయణ, నవీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డిజిటల్ హ్యుమానిటీస్ గురించి మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. వివిధ రంగాలకు, సంస్థలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు చర్చల్లో పాల్గొని సదస్సుని విజయవంతం చేశారని డా.వై.వి.సుధాదేవి తెలిపారు. సదస్సులో విశిష్ట అతిథిగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఏవీ గురవారెడ్డి హాజరై మాట్లాడారు. మానవీయ శాస్త్రాల్లో సాంకేతికత వాడటం వల్ల కొత్త అవకాశాలే కాక ఇబ్బందులు కూడా రావచ్చని హెచ్చరించారు. డిజిటల్ సాంకేతికతలు అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు సుదూరంగా ఉన్న పేషెంట్లని కూడా కనిపెట్టుకుని ఉండవచ్చన్నారు. అంతర్జాలం వల్ల ప్రజలకు విషయ సేకరణ సులభమైందని, వాటిలో నిజానిజాలను నిర్ధారించుకోవడానికి అనుభవమున్న నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. సదస్సులో భాగంగా డిజిటల్ పోస్టర్ ప్రదర్శనతో పాటు లఘుచిత్రాల పోటీ కూడా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎంపిక చేసిన లఘు చిత్ర ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఆంగ్లభాషా విభాగాధిపతి డా.కె. నీలవేణి, డా.సీడీ నాయుడు, డా.బి.చెన్నకేశవ రావు వివిధ విద్యాసంస్థలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్




గెలుపొందిన సిబ్బందిని అభినందిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: ఒత్తిడిలో ఉండే పోలీసులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అన్నారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన వివిధ క్రీడల్లో గెలుపొందిన బాలానగర్ డివిజన్ పోలీస్ సిబ్బందిని శనివారం ఆయన కార్యాలయంలో ప్రశంసించారు. పోలీసులు ఫిట్‌గా ఉండాలంటే తప్పకుండా క్రీడల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములవ్వాలన్నారు.

ప్రదర్శనను విజయవంతం చేయాలి

దుండిగల్: ఎస్సీ వర్గీకరణ ధర్మమైనదని, 30 ఏళ్లకు పైగా వర్గీకరణ కోసం పోరాటం జరుగుతుందని ఓయూ జేఏసీ నేత దరువు అంజన్న అన్నారు. 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు-వేల గొంతుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని శనివారం గండిమైసమ్మ చౌరస్తాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1994న మొదలైన ఉద్యమం నేటికీ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. 30 సంవత్సరాల ఉద్యమ కాలంలో ఎందరో మాదిగ వీరులు అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల నరసింహ, ఉద్యమకారుడు రాహుల్, కౌన్సిలర్ ఆనంద్, డప్పు రామస్వామి, వెంకట్, సాయిరాజ్, రజక సంఘం నాయకురాలు అంజలి, అశోక్ పాల్గొన్నారు.

పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం



ఓటింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సుభాష్‌నగర్: మనిషి యొక్క వజ్రాయుధం ఓటేనని నార్త్ సిటీ హైస్కూల్ వ్యవస్థాపకుడు కోలా రవీందర్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం సూరారంలోని నార్త్ సిటీ పాఠశాలలో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్, రమాదేవి పాల్గొన్నారు.

ఎట్టకేలకు గోదాం సీజ్

'సాక్షి' కథనంతో స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు



సీజ్ చేసిన గోదాం

సాక్షి ఎఫెక్ట్..

కుత్బుల్లాపూర్: గాజులరామారం సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఈ నెల 23న 'నోటీసులు ఇచ్చిన డోంట్ కేర్' అనే శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఉప కమిషనర్ మల్లారెడ్డి ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమంగా నిర్మిస్తున్న గోదాంను శనివారం సీజ్ చేశారు. సర్వే నంబర్ 467లో ఓ వ్యక్తి సుమారు 700 గజాల విస్తీర్ణంలో భారీ షెడ్డు ఏర్పాటు చేశాడు. టౌన్ ప్లానింగ్ అధికారులు డిసెంబర్ నెలలో నోటీసు.. స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశారు. అయినప్పటికీ పనులు కొనసాగించడంతో ఈనెల 10న సామగ్రిని సీజ్ చేశారు. అయినా అదే నిర్మాణంపై పనులు వేగవంతం చేయడం.. ఇదే విషయాన్ని 'సాక్షి'లో ప్రచురించడంతో ఉప కమిషనర్ మల్లారెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు జారీ చేసి 15 రోజులు గడిచిన తర్వాత సదరు నిర్మాణాన్ని కూల్చివేయాలని ఆదేశిస్తే.. చూస్తూ ఊరుకుంటారా..! అని టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరొకసారి పనులు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



నోటీసులిచ్చినా డోంట్ కేర్

ప్రచురితమైన కథనం

మహాసభలకు తరలిన సీపీఎం నాయకులు



షాపూర్‌నగర్ నుంచి సభకు వెళ్తున్న సీపీఎం నాయకులు

కుత్బుల్లాపూర్: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలో జరిగిన బహిరంగ సభకు కార్యకర్తలు తరలివెళ్లారు. షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ నుంచి మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో అంజయ్య, సత్యం, వెంకన్న, శ్రీను, తిమ్మప్ప, ఆంజనేయులు, మల్లారెడ్డి, రాజేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్: సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా సంగారెడ్డిలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు బాచుపల్లి మండలం నుంచి శనివారం కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకట రామయ్య మాట్లాడుతూ.. బాచుపల్లి మండలం నుంచి 100 మంది, జిల్లా నుంచి 500 మంది సభకు వెళ్లామన్నారు. ప్రజా సమస్యలపై అనేక తీర్మానాలు చేసి భవిష్యత్ కర్తవ్యాలను తీసుకోనున్నట్లు తెలిపారు.





త్వరలో లింకు రోడ్డు



కాలనీలో పర్యటిస్తున్న అధికారులు

జగద్గిరిగుట్ట: లింకు రోడ్లతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని గాజులరామారం డీఈ రూపాదేవి, ఏఈ తిరుపతి అన్నారు. లింక్ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో శనివారం పరిశీలించారు. మగ్దూం నగర్ నుంచి సబ్‌స్టేషన్, హెచ్‌ఎండీఏ ల్యాండ్, బీరప్ప నగర్, దేవమ్మ బస్తీ, గుబురు గుట్ట శ్మశాన వాటిక, గాంధీనగర్, వెంకట్రామిరెడ్డి నగర్ వరకు లింకు రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపి మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్, గండి రాజు, సత్యనారాయణ యాదవ్ పాండు, గోవర్ధన్, ముత్యాలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆర్మీ డే వేడుకలు



కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివానీ డిగ్రీ కళాశాలలో శనివారం ఆర్మీ డేని ఘనంగా నిర్వహించారు. నృత్య ప్రదర్శన, బైక్ పిరమిడ్‌లు, మానవ పిరమిడ్‌ల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. రిటైర్డ్ కల్నల్ డాక్టర్ అజయ్‌రెడ్డిని దేశానికి చేసిన సేవలకు గాను గౌరవించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆర్తి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ సంపతి, ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029